ఐటీ నోటీసులపై మౌనమేల?

- చంద్రబాబు రూ.119 కోట్ల అవినీతిపై తమ్ముళ్లు ఎందుకు మాట్లాడరు ?
- బాబుది అధికార దుర్వినియోగం కాదా?
- ఏ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఈసీ బాబుపై అనర్హత వేటు వేయాలి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: దేశంలోనే సంచలనం రేపిన రూ.119 కోట్ల అవినీతి కేసులో ఆరోపణలు ఎదుర్కుంటున్న టీడీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబునాయుడిని ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. 2014–19 మధ్య జరిగిన అవినీతిపై కేంద్ర ఆదాయ పన్నుల శాఖ పూర్తి ధర్యాప్తు చేసి మాజీ సీఎం చంద్రబాబుకు నోటీసులు జారీ చేసినా తెలుగు తమ్ముళ్లు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. పట్టణంలోని స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని బాబుకు ఐటీ నోటీసులు జారీ చేసినా స్పందించని టీడీపీ నాయకుల తీరును తప్పుపట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై, ప్రజా ప్రతినిధులపై ప్రతి చిన్నవిషయంపై గగ్గోలు పెట్టే తెలుగు తమ్ముళ్లు బాబుకు జారీ చేసిన ఐటీ నోటీసులపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. బాబుతోపాటు, దత్తపుత్రుడు, చిన్నబాబు సైతం కనీసం ఖండించకుండా మౌనం ఎందుకు పాటిస్తున్నారని నిలదీశారు. రూ.119 కోట్ల అవినీతి కేసులో చంద్రబాబు సరైన సమాధానం చెప్పకుండా దాటవేతదోరణిలో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పల్లోంజీ, ఎల్అండ్‌టీ కంపెనీల నుంచి ఈ డబ్బు అక్రమ మార్గంలో చంద్రబాబుకు ముట్టిందని, వారి ఈ–మెయిల్స్‌లో రికార్డు అయినట్లు ఎమ్మెల్యే కాటసాని పేర్కొన్నారు. ఆదాయ పన్నుశాఖ మొదట మనోజ్ వాసుదేవ్ పార్ధసాని అనే వ్యక్తిపై దృష్టిపెట్టాక డొంక కదిలిందన్నారు. కర్నూలు, విజయవాడ మరికొన్ని ప్రాంతాల్లో ఈడబ్ల్యూఎస్ హౌసింగ్ కింద చదరపు మీటర్ రూ.1500–2000 వేలు టెండర్ ఉంటే దాదాపు రూ.9వేలకు పిలిచి వచ్చిన ఆదాయాన్ని జేబుల్లో నింపుకున్నారని ఆరోపించారు. బినామీ మనోజ్ వాసుదేవ్ పార్ధసాని, చంద్రబాబు వ్యక్తిగత పీఏ శ్రీనివాస్ ఇద్దరి పేరు మీద నకిలీ అకౌంట్ ఏర్పాటు చేసి వచ్చిన ఆదాయం మొత్తాన్ని చంద్రబాబుకు చేరవేయడం జరిగిందన్నారు. గతంలో పీఏ శ్రీనివాస్, మనోజ్‌వాసుదేవ్ ఇంటిపై ఆదాయ పన్నుశాఖ అధికారులు దాడి చేసి కీలకమైన సమాచారాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.


సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్, ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్‌జాహెద్, ఖానిక్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాలకు పారిపోయిన బాబు బినామీలు!

రూ.119 కోట్ల అవినీతి కేసులో బినామీలైన మనోజ్‌వాసుదేవ్, శ్రీనివాస్..... మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతోనే విదేశాలకు పారిపోయారని ఎమ్మెల్యే కాటసాని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబును నమ్మే పరిస్థితిలేదని, ఆయన పాస్‌పోర్టును సీజ్‌కు చర్యలు చేపట్టాలని ఆదాయ పన్నుశాఖ అధికారులను కోరారు.

ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఫ్లెక్సీల వివాదం

ఏదైనా విషయాన్ని తప్పుదోవ పట్టించడంలో బాబు సిద్ధహస్తుడని ఎమ్మెల్యే కాటసాని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఐటీ నోటీసులు తేల్చడంతో ప్రజలను మభ్యపెట్టేందుకు పశ్చిమ గోదావరి జిల్లా బీమవరంలో పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ కుట్రకు తెరలేపారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను చించివేయించి అలజడి సృష్టించారన్నారు. అదేవిధంగా చర్చీలలో ఉన్న వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడులకు దాడులకు తెగబడ్డారని ఈ సందర్భంగా తెలుగు తమ్ముళ్ల తీరుపై కాటసాని ధ్వజమెత్తారు.

మంత్రి బుగ్గన చేసిన అభివృద్ధి కనపడలేదా బాబూ ?

- అప్పుల మంత్రి అని చెప్పడం విడ్డూరం
- మీ రోడ్‌షో ఆర్థిక మంత్రి కొత్తగా వేయించిన రోడ్డుపైనే సాగిన విషయం తెలియదా!
- చంద్రబాబు తీరును తప్పుపట్టిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్యాపిలి: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులు మీకు కనపడలేదా? అని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జున రెడ్డి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రశ్నించారు. బాబు గురువారం నిర్వహించిన రోడ్‌షోలో వ్యవహరించిన తీరును శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులు తప్పుపట్టారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఆర్థిక మంత్రి కేంద్రం వద్ద నిధులు తీసుకుని వస్తుంటే అప్పుల మంత్రి అని చంద్రబాబు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. డోన్ నియోజకవర్గంలో బుగ్గన దాదాపు రూ. 3 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్‌గ్రిడ్‌లో భాగంగా నియోజకవర్గంలో ఇంటింటికి సురక్షిత మంచినీరు అందించే పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. డోన్‌లో రూ. 50 కోట్లతో వంద పడకల ఆసుపత్రి నిర్మిస్తున్న విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. ప్యాపిలిలో రూ. 16 కోట్ల వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేసిన రహదారిపైనే చంద్రబాబు నాయుడు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. డోన్ నియోజకవర్గాన్ని 40 సంవత్సరాలుగా పాలించిన కుటుంబాలు చేయని అభివృద్ధి ఆర్థికమంత్రి చేసి చూపుతున్నారన్నారు. టీడీపీ నాయకులు ఒక రోజు తమతో పాటు వస్తే నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపిస్తామని తెలిపారు. ఒక వేళ అభివృద్ధి జరగడం లేదని టీడీపీ నాయకులు నిరూపిస్తే తాము రాజకీయ సన్యాసం చేసేందుకు కూడా సిద్ధమే అని వారు సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని చంద్రబాబు నాయుడు పగటి కలలు కంటున్నారని, మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షులు బోరెడ్డి రాము, అలేబాదు బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజా మురళీకృష్ణ, పర్వతం వాసుదేవ రెడ్డి, సోమశేఖర్, ప్రవీణ్, విఘ్నేశ్వర్‌రెడ్డి, ఇమాముద్దీన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

డోన్ టౌన్ : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం డోన్‌లో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డోన్ కోర్టు పరిధిలోని డోన్, బేతంచెర్ల, ప్యాపిలి, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో నమోదైన వివిధ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. సివిల్ తగాదాలు, బ్యాంక్ కేసులు, రాజీ అనుకూల క్రిమినల్ కేసులు, ప్రీలికేషన్ తదితర కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని వివరించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

11న అప్రెంటిషిప్ మేళా

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 11వ తేదీన ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్స్‌పాల్ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఐటీఐ పాస్ అయిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సంప్రదిస్తే రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తగ్గిన బంతిపూల ధర

బేతంచెర్ల: బంతిపూల ధర సైతం ఒక్కసారిగా పూర్తిగా తగ్గిపోయింది. మండల పరిధిలోని సీతారామాపురం గ్రామానికి చెందిన అద్దంకి నాగరాజు, తెలుగు శ్రీనివాసులు, నాగేషుడు, రాముడు అనే రైతులు సుమారు 20 క్వింటాళ్ల బంతి పూలను విజయవాడ మార్కెట్‌కు తీసుకెల్లారు. శుక్రవారం అక్కడ బంతిపూలు కిలో రూ. 10 కూడాఅడగపోవడంతో చేసేదేమి లేక రహదారి ప్రక్కన పారబోసి వచ్చారు. పూలకోతలు, వాహనం బాడుగకు సంబంధించి సుమారు రూ. 50వేల దాక నష్టం వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధర ఇలాగే కొనసాగితే పెట్టిన పెట్టుబడులు కూడా రావని రైతులు తెలిపారు.

క్లుప్తంగా

పాఠశాలలకు క్లీనింగ్ పరికరాల అందజేత


ప్లాస్టిక్ బకెట్లు, టాయిలెట్స్ క్లీనర్స్ పరికరాలను అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన ప్లాస్టిక్ బకెట్లు, టాయిలెట్ క్లీనర్స్, డస్ట్‌బిన్, సేఫ్టీగార్డ్స్ తదితర క్లీనింగ్ పరికరాలను శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో హెచ్‌ఎంలకు సీఆర్‌ఎంటీలు ప్రసాద్,శివరామయ్య, చంద్రుడు అందజేశారు. మండలంలో మొత్తం 79 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు క్లీనింగ్ పరికరాలను ప్రభుత్వం మంజూరు చేసిందని సీఆర్ ఎంటీలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరిదేవికి పల్లకీ సేవ


అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. ఉదయం ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆశీనులుగావించి పల్లకీ సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

బేతంచెర్ల: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు సూచించారు. మండలంలోని సిమెంట్ నగర్ గ్రామంలో 1, 2 గ్రామ సచివాలయాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఇళ్లలో నిల్వ ఉంచుకున్న నీటిని పారబోయాలన్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి వరప్రసాద్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా అనిల్

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన అనిల్ నంద్యాల జిల్లా మాదిగ విద్యార్థుల సంఘం జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, ఎస్సీ వర్గీకరణ సాధనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా అనిల్ తెలిపారు.

తల్లితండ్రుల కలలు సాకారం చేయాలి

కొలిమిగుండ్ల: ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఎస్ఐ రమేష్ రెడ్డి, ఎంఈఓ అబ్దుల్ కలామ్ విద్యార్థులకు సూచించారు. స్థానిక మోడల్ స్కూల్లో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ విద్యార్థినులు జూనియర్లకు వెల్‌కం చెప్పడం చాలా సంతోషకరమన్నారు. జీవితంలో స్థిరపడేందుకు ఉన్నత లక్ష్యంతో చదవాలన్నారు. వాయిదా పద్ధతి ఉండకూడదని, ఎప్పటిపని అప్పుడే పూర్తి చేయాలన్నారు. ఈసందర్భంగా తెలుగు అధ్యాపకులు గుర్రప్ప ఆధ్వర్యంలో ఇంటర్‌విద్యార్థులతో వేయించిన కోలాటం, చెక్క భజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు రాముడు, శివలింగారెడ్డి, ప్రశాంతి, సరిత పాల్గొన్నారు.

సన్మానం


వరప్రసాద్‌రావు సన్మానిస్తున్న దృశ్యం

డోన్ రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్‌డీగా పని చేస్తున్న వరప్రసాద్‌రావు కడప జిల్లాలోని పోరుమామిళ్ల మండలానికి మండల అభివృద్ధి అధికారిగా, అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాజు ప్యాపిలి మండలానికి రికార్డు అసిస్టెంట్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం వారిని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌యాదవ్, వైఎస్ ఎంపీపీ ఎర్రిస్వామి, ఏఈ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


మాట్లాడుతున్న ప్రభాకర్

డోన్ టౌన్ : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మండల విద్యాధికారి ప్రభాకర్, ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగం అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆగస్టు 27,28,29 తేదీల్లో అనంతపురం ఆర్డీటీ స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహించిన బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలతోపాటు పాల్గొన్న క్రీడాకారిణులను సన్మానించారు. షాట్ పుట్‌లో బంగారు పతకం సాధించిన డోన్ కస్తూర్బీ విద్యార్థిని ప్రవీణను సత్కరించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రఫిక, సుజాత, ఆర్డీటీ ఏటీఎల్ నాగభూషణం, సిబ్బంది బాలగోపాల్, ఇంద్రలత, నాగేంద్ర, రామ్మోహన్, సురేష్, అయ్యస్వామి, కరీం తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యవంతమైన జీవితం


ధ్యానం చేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: ధ్యానం చేయడం వలన మానసికంగా ప్రశాంతంగా చేకూరుతుందని, ఆరోగ్యవంతమైన జీవితం గడుపుతారని పత్రీజీ ధ్యాన మహిళా పిరమిడ్ స్పిరిచ్‌వల్ సొసైటీ మూమెంట్(పీఎస్ఎస్ఎం)ఇన్‌చార్జీ ద్వారకనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నందవరం గ్రామ సమీపంలో ఉన్న శ్రీసదానందసద్గురు యోగి ఆశ్రమంలో ధ్యానంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ద్వారకనాథ్ ధ్యానం పద్ధతులను వివరించారు. ధ్యానం ఒత్తిడిని దూరం చేస్తుందన్నారు. ప్రతి రోజు వీలున్న సమయంలో ధ్యానం చేయాలని సూచించారు. కొంతసేపు ధ్యానం చేయించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ భువనేశ్వరరాజు, బనగానపల్లె కమిటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రామసుబ్బయ్య, తిరుమలయ్య, సుధీర్‌కుమార్‌రెడ్డి, సునీత, శైలజ, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలుతీర్చే దేవుడు కోనేటిరాయుడు

- 9న వరదపాయసం మహోత్సవం

డోన్ : మండల పరిధిలోని ఆవులదొడ్డి గ్రామ సమీపాన కొండలలో వెలసిన కోనేటి రాయుడు భక్తుల కోర్కెలుతీర్చే దేవుడిగా పేరొందారు. దట్టమైన అటవీ ప్రాంతంలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలాయం భక్తులను ఆకట్టుకుంటుంది. ప్రతి ఏటా శ్రావణమాసంలో శనివారాలతో పాటు వైకుంఠ ఏకాదశి రోజున వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. ఈనెల 9వ తేదీన రెండవ శనివారం స్వామివారి గుడి వద్ద వర్షాల కోసం భక్తులు వరదపాయసం మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్తలు, ప్రముఖ న్యాయవాది ఆలా మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వరద పాయసం మహోత్సవం, సామూహిక వనభోజనాలు జరుగనున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

దినదినాభివృద్ధి చెందుతున్న ఆలయం

ఆవులదొడ్డి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతుంది. ఆలాయానికి పకృతి అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. శతాబ్దాల కిందట బండరాళ్లలో నిర్మించిన మెట్లు ఆకట్టుకుంటున్నాయి. స్వామివారిని ఈ మెట్ల మార్గం ద్వారా దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు చిన్నచిన్న సెలయేర్లు కనువిందులు చేస్తాయి. ఆలయ ఆవరణలో 30 ఎడుగుల ఎత్తు ఆంజనేయస్వామి విగ్రహం, రూ.5లక్షలతో కల్యాణ మండపాన్ని కూడా నిర్మిస్తున్నారు. భక్తులు స్నానం ఆచరించేందుకుచక్కటి కోనేరు ఉంది. ఆలయ ఆవరణలో శ్రీరంగనాథుడు, సాక్షి గణపతి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.


ఆలయంలో కొలువైన కోనేటిరాయుడు

పెద్దరాజు స్వామి దర్గాలో ప్రార్థనలు

బేతంచెర్ల : మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో వెలసి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన పెద్ద రాజు స్వామి దర్గాను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా దర్గా పీఠాధిపతి గురుసయ్యద్ అక్బర్ బాషాఖాద్రి, దర్గా నిర్వాహకులు గురుసయ్యద్ షా బాషా ఖాద్రి ఆధ్వర్యంలో పెద్ద రాజు స్వామి దర్గాలో ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఆవరణంలో గ్రామానికి చెందిన మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ. 40 లక్షలతో భక్తుల సౌకార్యర్థం నిర్మించిన సులభ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. అనంతరం సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కృషి చేసిన మోహన్ రెడ్డి ని అభినందించారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, సుధాకర్, సర్పంచ్ శ్రీరాములు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మోహన్‌రెడ్డిని అభినందిస్తున్న దర్గా పీఠాధిపతి, ఎంపీపీ బుగ్గన

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: జలదుర్గం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వినయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జలదుర్గం సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల నేపథ్యంలో రామకృష్ణాపురం, గార్లదిన్నె, మాధవరం, ఊటకొండ, గోపాలనగరం, రామరత్నగిరి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

డోన్ టౌన్ : యు.కొత్తపల్లె సబ్ స్టేషన్ 33కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఇండస్ట్రియల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొత్తపల్లె, ఉంగరానిగుండ్ల, దొరపల్లె గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంటు ఉండదన్నారు. అలాగే చిన్నమల్కాపురం 33 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయిత్రం 6 గంటల వరకు కరెంటు ఉండదని ఆయన తెలిపారు. వ్యవసాయానికి సంబంధించి రైతులకు కరెంట్ ఉదయం 5గంటల నుంచి సరఫరా చేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

డోన్ టౌన్: ఆర్టీసీ సేవలపై శనివారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలను నేరుగా 9959225795 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

దోమల నివారణకు ఫాగింగ్

డోన్ టౌన్: పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ కార్మికులు చేపట్టిన ఫాగింగ్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటరామిరెడ్డి పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డుల్లో ఫాగింగ్ చేయిస్తామని, ప్రజలు కూడా పరిసరాల శుభ్రత పాటించి సహకరించాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

మహానందీశ్వర దంపతులకు శాంతి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు శుక్రవారం శాంతి కల్యాణ పూజలు వైభవంగా జరిగాయి. వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, అక్షింతల సమర్పణ, మాంగళ్యధారణ, పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

మహానందం...పల్లకోత్సవం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శ్రావణమాసం, శుక్రవారం రాత్రి పల్లకీ ఉత్సవం మహానందంగా సాగింది. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీ ముందు గోమాతను ఉంచి ఆలయ ప్రాకారంలో ఉత్సవం కనుల పండువగా చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

నంద్యాల-పత్తికొండ బస్సు ఏర్పాటు హర్షణీయం



బస్సు వద్ద పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయులు

- నంద్యాల-పత్తికొండ బస్సు ఏర్పాటు హర్షణీయం

ప్యాపిలి: జిల్లా కేంద్రం నంద్యాల, కర్నూలు జిల్లా పరిధిలోని పత్తికొండ పట్టణాలకు వెళ్లాలంటే ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు బస్ సర్వీసు ఏర్పాటు అభినందనీయమని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాజా నారాయణ మూర్తి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల నుంచి ప్యాపిలికి వచ్చిన బస్‌కు వారు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల డిపో నుంచి ఉదయం 7–50 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. 11–25కి ప్యాపిలికి వచ్చి ఇక్కడి నుంచి పత్తికొండకు వెళ్తుందన్నారు. పత్తికొండలో మధ్యాహ్నం 1–20 గంటలకు బయలుదేరి 2–10 గంటలకు ప్యాపిలికి వస్తుందన్నారు. ఇక్కడి నుంచి నంద్యాలకు వెళ్తుందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక చొరవతో బస్ ఏర్పాటు చేయించిన మంత్రి బుగ్గనకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు బోరెడి రాము, అలేబాదు బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బోరెడ్డి కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, షాషావలి, సోమశేఖర్, కలచట్ల నాగరాజు, మస్తాన్ ఖాన్, షేక్షావలి, పర్వతం వాసుదేవ రెడ్డి, సుధాకర్ గౌడ్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణుని పల్లకీసేవలో పాల్గొన్న ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్


స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

డోన్ : గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారంతో ఘనంగా ముగిసాయి. త్రైతసిద్ధాంత సభ్యులు స్థానిక పాతబస్టాండ్‌లో ఏర్పాటుచేసిన శ్రీకృష్ణుని విగ్రహానికి మూడు రోజుల పాటు పట్టణ పరిసర గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ నామస్మరణతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. ముగింపు వేడుకల్లో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఉద్యాన వన యూనివర్సిటీ సభ్యురాలు సప్తశైల సుమిత్ర దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా జరిగిన శ్రీకృష్ణుని పల్లకీసేవలో వారు పాల్గొన్నారు. త్రైతసిద్ధాంత ప్రచార సంఘం సభ్యులు, మహిళలు, పిల్లలు ప్రదర్శించిన కోలాటం, చెక్కభజన ఆకట్టుకుంది.

వైభవంగా శ్రీ కృష్ణుని గ్రామోత్సవం

కొలిమిగుండ్ల: మండలపరిధిలోని బందార్లపల్లె గ్రామంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవా రం స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం ప్రత్యేక పల్లకీ అలంకరించిన శ్రీకృష్ణుని ఉత్సవమూర్తిని కొలువుంచి మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగింపు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.


శ్రీకృష్ణుడి గ్రామోత్సవంలో కోలాట ప్రదర్శిస్తున్న మహిళలు